'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com


## నమస్తే తెలంగాణ

# రాష్ట్రపతి ఆమోదానికీ కాలావధి

**గవర్నర్** అనేది రాష్ట్ర పరిపాలనా యంత్రాంగానికి తలమానికంగా, రాజ్యాంగ పరిరక్షణను పర్యవేక్షించాల్సిన నామమాత్రపు పదవిగా ఉంటుందనేది ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. అంతకన్నా ఎక్కువా కాదు, తక్కువా కాదు. మంత్రిమండలి సలహా మేరకు గవర్నర్ నిర్ణయాలు తీసుకుంటారనేది ఆచరణలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానిదే తుది మాట అని చెప్పకనే చెప్పడం. కానీ గవర్నర్లు కేంద్ర అధికార పార్టీకి తాబేదార్లుగా, ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను వేధించే అనధికార కేంద్రాలుగా తయారుకావడం మనం చూస్తున్నాం. ఇటీవల తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి వివాదం చిలికిచిలికి గాలివానగా మారడం, సుప్రీంకోర్టు గడప తొక్కడం తెలిసిందే. తమిళనాడు గవర్నర్ కేసులో బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపడానికి సంబంధించి సుప్రీంకోర్టు కాలావధి నిర్ణయించడం గురించి ఇదివరకే చెప్పుకొన్నాం. తాజాగా రాష్ట్రపతికి నివేదించే బిల్లులపైనా స్పష్టతను ఇచ్చింది.

గవర్నర్ తన పరిశీలనకు పంపే బిల్లుల విషయంలో మూడు మాసాల్లోగా ఏదో ఒక నిర్ణయం రాష్ట్రపతి తీసుకోవాలని గడువు విధించింది. ఇందుకు సంబంధించి రాజ్యాంగంలో కాలావధి అనేది లేకపోవడం వల్ల నిరవధికంగా బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయే పరిస్థితి ఎదురవుతున్నది. అంటే ఆచరణలో రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలకు కేంద్రం మోకాలడ్డు పెట్టడం జరుగుతున్నది. ఇది సమాఖ్యవాదానికి గొడ్డలి పెట్టు తప్ప మరొకటి కాదు. ఏ విషయంలోనూ అతి చేయొద్దు అనే నీతి గవర్నర్లకూ వర్తిస్తుందని ఈ తీర్పు తేల్చిచెప్పింది. ఈ తీర్పు అత్యంత కీలకమైందే కాకుండా చరిత్రాత్మకమైంది కూడా. నిరవధికంగా బిల్లును తొక్కిపెట్టడం రాజ్యాంగం నిర్వచించిన నిష్పాక్షిక విధి నిర్వహణ సూత్రాన్ని ఉల్లంఘిస్తుందని సర్వోన్నత న్యాయస్థానం తీర్మానించడం విశేషం. సుదీర్ఘ పర్యవసానాలకు దారితీసే మరో రెండు కీలక నిర్ణయాలు సుప్రీంకోర్టు కూడా చేసింది. ఒకటి, నిర్ణీత కాలావధిలో రాష్ట్రపతి నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్ర ప్రభుత్వాలు పిటిషన్ దాఖలు చేయాలని సూచించడం. రెండు, గవర్నర్ నివేదించే బిల్లులపై సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని రాష్ట్రపతి తీసుకోవాలని చెప్పడం.

గవర్నర్ల వ్యవస్థ హద్దుమీరిన కారణంగా చివరికి రాష్ట్రపతి నిర్ణయాధికారాల దాకా పోవాల్సిన అవసరం ఏర్పడిందన్న మాట. అయితే, రాజ్యాంగంలో లేని అంశాలను సుప్రీంకోర్టు సూచించడం న్యాయవర్గాల్లో సహజంగానే చర్చాంశం అవుతున్నది. కేంద్రంపై విమర్శలు రాకుండా ఉండేందుకు ఈ మార్గమే శరణ్యమని సుప్రీంకోర్టు తెలిపింది. గవర్నర్‌కు బిల్లులపై నిరంకుశ 'వీటో' అధికారం ఉండదన్న సూత్రం రాష్ట్రపతికీ వర్తిస్తుందనేది సుప్రీం కోర్టు తీర్పు సారాంశం. నిర్ణీత గడువు తర్వాత గవర్నర్ ఆమోదం లభించకపోతే బిల్లులకు రాజముద్ర పడినట్టుగానే భావించాలన్న మరో కీలక నిర్ణయం దేశ చరిత్రలోనే ఓ అసాధారణ ఘట్టానికి తెరతీసింది. ఈ ఆదేశాల ఆధారంగా తమిళనాడు ప్రభుత్వం పది బిల్లులను గవర్నర్ సంతకం లేకుండానే చట్టాలుగా ప్రకటిస్తూ గెజిట్ విడుదల చేసింది. ఇది దేశ ప్రజాస్వామ్య చరిత్రలో అపూర్వ, అసాధారణ ఘట్టమని చెప్పాలి. కేంద్ర-రాష్ట్ర తగాదాలలో ప్రస్తుతానికి తమిళనాడు విజయం సాధించింది. నిజానికిది సమాఖ్యవాదానికి లభించిన విజయంగా భావించాలి.

# పాలకుడి లక్షణం: ప్రస్తుతం అవలక్షణం



**దంటు కనకదుర్గ**
89772 43484

**మానవ జీవితానికి దిక్సూచిగా వేదాలలో అన్నిరంగాలకు, వ్యక్తిత్వ జీవనానికి కూడా మార్గదర్శక సూత్రాలు ఇవ్వబడ్డాయి. ఒక వ్యక్తి తన జీవితం ఎట్లా గడపాలి; కుటుంబంతో ఎటువంటి సంబంధ బాంధవ్యాలు నెరపాలి, ఆ బాధ్యతలు ఏమిటి, ఎట్లా తీర్చుకోవాలి; సమాజం పట్ల ఎట్లా వ్యవహరించాలి, ఒక సభ్యుడిగా తన బాధ్యతలేమిటి, సమాజంలో అందరూ శాంతిగా, ఆనందంగా, క్షేమంగా బ్రతకటానికి ఏమి చేయాలనే విషయాలు చాలా వివరంగా, సుస్పష్టంగా నాలుగు వేదాలలోనూ ఇవ్వబడ్డాయి. అవి మత సంబంధమైన గ్రంథాలు కావు. జీవన విధానానికి తోడ్పడి మానవ సమాజమంతా ఒక్కటిగా బ్రతికే ధర్మాన్ని విశదీకరించిన మహోత్కృష్ట విజ్ఞాన, జ్ఞాన సర్వస్వాలు.**

వేదాలలో ముగ్గురు వ్యక్తులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వబడింది. ఎందుకంటే ఒక సమాజం, రాజ్యం సుఖంగా, సుభిక్షంగా ప్రగతి చెందుతూ, నాగరికత పెంచుకుంటూ వృద్ధి చెందాలంటే ఆ ముగ్గురూ సామాన్య వ్యక్తులు కాక, అత్యంత ప్రజ్ఞావంతులు, మేధావులు అయి ఉండాలి. వారు పాలకుడు, వేదాలలో జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని అవపోసన పట్టిన సలహాదారు, శాస్త్రజ్ఞుడు. ఈ ముగ్గురూ మానవ సమాజానికి అత్యంత అవసరమైనవారు. అందులో పాలకుడికి ఏ లక్షణాలు ఉండాలని వేదాలు ఏమేమి నిర్దేశించాయో చూద్దాం.

పాలకుడు ఆదర్శ మానవుడిగా ఉండాలి. అంటే ఇతరులు అతని లక్షణాలు చూసి ఆకర్షితులై, అభిమానించటమే కాదు, అతనిలా తాము ఉండాలన్న కోరిక పెరగాలి. ఉన్నత విద్యావంతుడు, నైపుణ్యాలు కలిగినవాడు, మంచిగుణాలు ఉన్నవాడు, పండితులతో సమంగా జ్ఞానం కలిగినవాడు, నిజాయితీ పరుడు, ప్రజలను తమ బాధ్యతల పట్ల ఉత్సాహవంతులను చేస్తూ, తన బాధ్యతలు సక్రమంగా నెరవేర్చేవాడు అయి ఉండాలి. (యజుర్వేదం, 7వ అధ్యాయం, 16వ మంత్రం). పాలకుడికి ధర్మజ్ఞానం ఉండి, తన ఇంద్రియాలను అదుపులో పెట్టగలిగి ఉండాలి. అధర్మమైన ఆలోచనలు రానివాడు, అనైతికమైన పనులు చేయనివాడు అయి ఉండాలి. ప్రజలు విద్యావంతులు అవటానికి పాటుపడుతూ వారు ధర్మ మార్గంలో నడిచేటట్టు ప్రోత్సహించాలి. (యజుర్వేదం, 8వ అధ్యాయం, 23వ మంత్రం).

> విద్యావంతుడే కాక వివిధ రంగాల అవగాహన కలిగి, చక్కటి రూపం బలమైన శరీరం కలిగి, పూర్ణ ఆరోగ్యవంతుడై ఉండాలి. భౌతికమైన ఆరోగ్యమే కాదు, మానసికంగా కూడా బలవంతుడై సకారాత్మక ఆలోచనలు, ప్రజల మీద అత్యంత ప్రేమాభిమానాలు కలిగినవాడై ఉండాలి. (యజుర్వేదం, 9వ అధ్యాయం, 23వ మంత్రం).

పరిపాలనాదక్షుడు, వితరణశీలి, ప్రజాభిమానం చూరగొనేట్టు మంచి గుణాలు కలిగినవాడు, రాష్ట్రాన్ని, రాజ్యాన్ని సుసంపన్నం చేయగల పరిపాలన అందించగలిగినవాడు మాత్రమే పాలకుడిగా ఉండటానికి అర్హుడు. (యజుర్వేదం, 9వ అధ్యాయం, 32వ మంత్రం). ప్రజలందరినీ విద్యావంతులను చేయాలనే దృఢమైన సత్సంకల్పం కలిగి, విద్యాసంస్థలను కాపాడి, యువతను విద్య వైపు ఆకర్షించగలిగినవాడు, నిజాయితీ, నిష్ఠ కలిగి తాను స్వయంగా చాలా రంగాలలో నిష్ణాతుడైనవాడే పాలన చేయగలడు. (యజుర్వేదం, 9వ అధ్యాయం, 38వ మంత్రం). సంస్కారవంతమైన కుటుంబానికి చెంది, సకారాత్మక ఆలోచనలు, పాండిత్యం కలిగినవాడే పాలకుడవాలి. (యజుర్వేదం, 9వ అధ్యాయం, 40వ మంత్రం). ప్రతిభావంతులైన ఆధ్యాత్మిక గురువుల వద్ద ఉన్నత విద్యాభ్యాసం పొంది, దుర్గుణాలకు లొంగనివాడు, సత్యాన్ని నమ్మి నిజాయితీగా ఉండేవాడు, ఆహ్లాదకరంగా మాట్లాడేవాడు, ప్రజల గురించి ఎప్పటికప్పుడు విచారిస్తూ వారి సమస్యలను సత్వరం తీర్చేవాడు, న్యాయాన్ని గౌరవిస్తూ, న్యాయంగా పక్షపాతరహితంగా పరిపాలన అందించగలిగినవాడే విజయవంతంగా ప్రజలను పాలించగలడు. (యజుర్వేదం, 12వ అధ్యాయం, 14వ మంత్రం). శాస్త్ర విజ్ఞానం పుష్కలంగా కలిగి, మాతృభూమి మీద అమిత ప్రేమ ఉన్నవాడు, వివక్ష లేకుండా న్యాయబద్ధంగా ప్రవర్తించేవాడు మాత్రమే పాలకుడిగా ఉండటానికి అర్హుడు. (యజుర్వేదం, 17వ అధ్యాయం, 33వ మంత్రం). మచ్చలేని వ్యక్తిత్వం కలిగి, మానవీయ కోణంలో అందరినీ సమంగా ఆదరించగలిగినవాడు, ప్రజాక్షేమం, వారి సుఖమే లక్ష్యంగా కలవాడు, ప్రజల జీవన ప్రమాణాలు పెంచగలిగినవాడు, రాజ్యాన్ని ప్రగతి పథంలో నడిపి, ప్రజలందరినీ సంపన్నులను చేయగలిగినవాడు, నిస్సహాయులను ఆదుకోవాలన్న సంకల్పం ఉన్నవాడే పాలనకు అర్హుడు. (యజుర్వేదం, 33వ అధ్యాయం, 16వ మంత్రం).



పైన చెప్పిన లక్షణాలు ఒకే వేదం- యజుర్వేదం-లో చెప్పినవి. ఇంకా చాలా లక్షణాలు - సైన్యాన్ని శత్రువులను అణచటానికి మాత్రమే వాడాలనీ, ప్రజలకు మేలు చేసే పనులు మాత్రమే పాలకులు చేయాలనీ, అన్నిరంగాలనీ నిష్పక్షపాతంగా, ప్రజ్ఞావంతంగా, మేధస్సును ఉపయోగిస్తూ, ప్రతి చిన్న విషయాన్ని ప్రజలకు వివరిస్తూ అత్యంత పారదర్శకంగా పరిపాలన సాగించటమే పాలకుడి కర్తవ్యమనీ, ఇందులో అరిషడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలకు తావివ్వకూడదనీ- ఇంకా చాలా బాధ్యతలు పాలకుడికి ఉండేవి వర్ణిస్తాయి నాలుగు వేదాలు కూడా.

> **ఇక తెలంగాణ రాష్ట్ర పరిస్థితి గురించి చూద్దాం. పద్నాలుగేండ్ల ఉద్యమం నడిపి, తన జీవితాన్ని పణంగా పెట్టడానికి కూడా సిద్ధపడి, రాష్ట్రాన్ని సాధించి మొట్టమొదటి పాలకుడైన కేసీఆర్‌కు తన మాతృభూమి మీద ప్రేమ ఉండటం సహజమే! అది అందరికీ అర్థమైంది కూడా. కానీ, ఆయన ముఖ్యమంత్రి అయ్యాకనే వారి వితరణశీలత్వం మేధ, ప్రజ్ఞ, విశాలమైన భావాలు, ఆలోచనను ఆచరణలో పెట్టగలిగిన ప్రతిభ లోకానికి తెలిసింది.**

ఇక తెలంగాణ రాష్ట్ర పరిస్థితి గురించి చూద్దాం. పద్నాలుగేండ్ల ఉద్యమం నడిపి, తన జీవితాన్ని పణంగా పెట్టడానికి కూడా సిద్ధపడి, రాష్ట్రాన్ని సాధించి మొట్టమొదటి పాలకుడైన కేసీఆర్‌కు తన మాతృభూమి మీద ప్రేమ ఉండటం సహజమే! అది అందరికీ అర్థమైంది కూడా. కానీ, ఆయన ముఖ్యమంత్రి అయ్యాకనే వారి వితరణశీలత్వం మేధ, ప్రజ్ఞ, విశాలమైన భావాలు, ఆలోచనను ఆచరణలో పెట్టగలిగిన ప్రతిభ లోకానికి తెలిసింది. ఇదివరకు మంత్రులకు , ఐఏఎస్ సాధించి వివిధ శాఖలలో కార్యదర్శులుగా చేసిన ప్రతిభావంతులు, ఐపీఎస్ సాధించి పోలీసు శాఖను శాసించే అధికారులు సలహాలు ఇవ్వవలసి వచ్చేది. అటువంటిది వారందరినీ కూర్చోబెట్టి వ్యవసాయం దగ్గరి నుంచీ, ప్రజారక్షణ, జీవ విధానం సంరక్షణ, సాంస్కృతిక పునరుజ్జీవనం గురించి బోధించగలిగిన పాలకుడు బహుశా భారతదేశ చరిత్రలో కేసీఆర్ ఒక్కరే!

> అరకొర చదువులు, మొండితనం, పక్షపాత ధోరణి, కక్షసాధింపు చర్యలు చేసే మంత్రులకు, ముఖ్యమంత్రులకు సలహాలిచ్చే అధికారులకు అన్నిరంగాల్లో దిశానిర్దేశం చేసి, రాష్ట్రాన్ని అత్యంత ప్రగతిశీలంగా, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యేటట్టు కేవలం తొమ్మిదిన్నరేండ్లలో సాధించిన అత్యంత ప్రతిభావంతుడైన పాలకుడు మాత్రం ఒక్క కల్వకుంట్ల చంద్రశేఖరరావు మాత్రమే!

ఇక మెత్తని పట్టుపరుపు మీంచి కొలిమిలోకి దూకి రెండవ ముఖ్యమంత్రిని, ఆయన పార్టీని గెలిపించిన ప్రజలకు ఇప్పుడిప్పుడే అసలుకు, నకలుకు తేడా తెలుస్తోంది. ఇక ప్రస్తుత పాలకుడి లక్షణాలు, పైన చెప్పిన పాలకుడి లక్షణాలతో పోల్చి చూసుకోవలసిన బాధ్యత ప్రజలకే ఉంటుంది. లక్ష్యాన్ని సాధించి ప్రజలకు సుఖశాంతులతో పాలించినవారికి, లేకి బుద్ధులు, దుర్మార్గపు ఆలోచనలు, కక్షసాధింపు చర్యలే పాలనగా సాగిస్తున్నవారికి ఉన్న భేదం ప్రజలకు బాగా అర్థమవుతున్నది. అందుకే అసలు సిసలైన పాలకుడి లక్షణాలు ప్రస్తుత పరిపాలన చేస్తున్నవారిలో ఎన్ని ఉన్నాయో లెక్కపెట్టుకునే బాధ్యత ప్రజలకే వదిలేద్దాం!

# తెలంగాణ జాతరకు పోదాం



**దేవీప్రసాద్**

**తెలంగాణ చరిత్రలో మరుపురాని రోజు 2001 ఏప్రిల్ 27. తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించిన రోజు అది. తెలంగాణ ప్రాంతంలో ఆట, పాట బంద్ అయ్యి, ప్రజల కష్టాలు, కన్నీళ్ల గురించి చెప్పుకొని కన్నీరు కార్చే అవకాశం లేని కాలం. సమైక్య పాలనలో పల్లె ప్రజలపై జరుగుతున్న దాష్టీకాలు, నిర్బంధాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న యువకులను ఎన్‌కౌంటర్ల పేరిట పిట్టల్లా కాల్చిచంపడం, తెలంగాణ అంటే నక్సలైట్ అని ముద్ర వేయడం, ఉంటే జైల్ లేకుంటే అడవి అనే గ్రామీణ ముఖచిత్రం.. ఒక్క మాటలో చెప్పాలంటే తెలంగాణలో అన్ని హక్కులు కాలరాయబడి తీవ్ర అణచివేతలతో తల్లడితున్న చారిత్రక సందర్భం. అలాంటి సమయంలో ప్రజల ఆకాంక్షల పురిటినొప్పులతో తెలంగాణ రాష్ట్ర సమితి పురుడుపోసుకుంది.**

తెలుగుదేశం పాలనలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని డిప్యూటీ స్పీకర్ హోదాలో కేసీఆర్ అనేకసార్లు ఎదిరించారు. ప్రజల సమస్యలపై నిరంతరం వివిధ వర్గాలతో చర్చించేవారు. ఈ నేపథ్యంలో సమైకాంధ్ర పాలన నుంచి తెలంగాణకు విముక్తి లభిస్తే తప్ప సమస్య పరిష్కారం కాదని నిర్ణయించుకున్నారు. అందుకు సరైన సమయం కోసం వేచిచూస్తున్నారు. ఆ సందర్భంలో విద్యుత్తు సంస్కరణల పేరిట టీడీపీ సర్కారు చార్జీల పెనుభారాన్ని మోపడంతో కేసీఆర్ వెంటనే లేఖాస్త్రం సంధించారు. విద్యుత్తు చార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేయడం సమైకాంధ్ర పాలకుల్లో అలజడి సృష్టించింది. ఈ నేపథ్యంలోనే స్వరాష్ట్ర సాధన ద్వారానే తెలంగాణ ప్రజలకు విముక్తి లభిస్తుందని నిశ్చయించుకొని తన పదవులకు రాజీనామా చేశారు. అలా తెలంగాణ సాధన కోసం ఉద్యమ పార్టీ ఏర్పాటు చేయాలని సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న రోజే ఏప్రిల్ 27. తెలంగాణ ప్రజల కోసం టీఆర్ఎస్ రాజకీయ గొంతుగా ఉద్భవించింది. తెలంగాణ బహిరంగ జైల్‌గా మారింది. విప్లవ ప్రజాసంఘాల ప్రభావంతో జరుగుతున్న ఆందోళనలను అణచివేయడానికి పల్లెలన్నీ పోలీస్ క్యాంపులుగా మారిపోయాయి. అణచివేత, నిర్బంధం రాజ్యమేలుతున్న తరుణంలో ప్రజలకు టీఆర్ఎస్ రాజకీయ ఆయుధంగా మారింది.

తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను తిరిగి ప్రజ్వలింపచేసి, శాంతియుత ప్రజాస్వామ్య స్ఫూర్తిని కొనసాగిస్తూ, గాంధేయ మార్గంలో అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలని కేసీఆర్ తీసుకున్న ఉద్యమ ఎజెండా అన్ని వర్గాలను ఏకతాటిపైకి నడిపించింది. ఎన్నికలను కూడా ఒక ఉద్యమ పోరాటరూపంగా మార్చి తద్వారా వివిధ రాజకీయ పార్టీలపై, ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి లక్ష్యాన్ని చేరుకోవాలనే మార్గంతో కొందరు విభేదించినా.. కేసీఆర్ ఎంచుకున్న మార్గం రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించింది. లక్షలాది మందితో నిర్వహించిన సభలు, ర్యాలీలు, బస్సు యాత్రలు, పాద యాత్రలు, సడక్ బంద్, సాంస్కృతిక ప్రదర్శనలు, సకలజనుల సమ్మె, మిలియన్ మార్చ్, సంసద్ యాత్రలు అందర్నీ ఏకం చేశాయి. రాష్ట్రం ఏర్పాటు చేయాల్సిందేననే విస్తృత అభిప్రాయం వ్యక్తమయ్యేందుకు దోహదం చేశాయి.


> టీఆర్ఎస్ ఆవిర్భవించిన తొలినాళ్లలోనే జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించడంతో గ్రామాల్లో బలమైన పునాదికి మార్గం సుగమమైంది. 2004 సాధారణ ఎన్నికల్లో టీఆర్ఎస్‌తో పొత్తు లేకుండా తెలంగాణలో ఓట్లు అడిగే పరిస్థితి లేని రాజకీయ వాతావరణం ఏర్పడింది.

తెలుగుదేశం ప్రభుత్వం పట్ల వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకొని తెలంగాణ ఆకాంక్షకు కాంగ్రెస్ మద్దతు పలికింది. తద్వారా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తెలంగాణ అంశాన్ని కామన్ మినిమం ప్రోగ్రాంలో చేర్చింది. టీఆర్ఎస్ ఒత్తిడితో ప్రణబ్ నేతృత్వంలో కమిటీ ఏర్పడింది. కేంద్రమంత్రి హోదాలో కేసీఆర్, ఆచార్య జయశంకర్ 32 రాజకీయ పార్టీలను కలిసి తెలంగాణ ఏర్పాటుకు అనుకూలంగా లేఖలు తీసుకొని ప్రణబ్ కమిటీకి అందించారు. రాష్ట్ర ఏర్పాటుకు దేశ స్థాయిలో జరిగిన మొదటి రాజకీయ ప్రక్రియ ఇదే కావడం గమనార్హం. కాంగ్రెస్ మరోసారి మోసం చేయడంతో సంకీర్ణం నుంచి టీఆర్ఎస్ వైదొలిగింది.




మంత్రి పదవులను త్యజించడం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని మరింతగా పెంచింది. 2009 ఎన్నికల్లో టీడీపీ చేత తెలంగాణకు అనుకూలంగా తీర్మానం చేయించినప్పటికీ ఆ పార్టీ రాజకీయ కుట్రలకు పాల్పడటంతో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చింది. ఆ రెండు పార్టీలు మొదట 'జై తెలంగాణ' ఆ తర్వాత 'నై తెలంగాణ' అనడంతో యావత్ తెలంగాణ కేసీఆర్ వెంట నడిచే పరిస్థితులు ఏర్పడ్డాయి. అదే సమయంలో హైదరాబాద్‌ను ఫ్రీ జోన్ చేయడంతో తెలంగాణలో ఆందోళనలు పెల్లుబికాయి. కేసీఆర్ నాయకత్వంలో 2008 అక్టోబర్ 21న సిద్దిపేట ఉద్యోగ గర్జన సభను టీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యోగులు పెద్ద ఎత్తున నిర్వహించారు. కేసీఆర్ ఇచ్చి న పెన్ డౌన్ పిలుపు ఉద్యోగులకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ నేపథ్యంలో 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో 2009 నవంబర్ 27న కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించడం తో తెలంగాణ ఉద్యమం తారస్థాయికి చేరుకున్నది. కేసీఆర్ అరెస్ట్ కాగానే తెలంగాణ ఉద్యోగులు పెన్ డౌన్ చేశారు. యూనివర్సిటీ విద్యార్థులు రోడ్డెక్కారు.

కేసీఆర్ ఆరోగ్యం క్షీణిస్తున్న తరుణంలో ఏదైనా జరిగితే తమకు శాశ్వత రాజకీయ సమాధి తప్పదని, 2009 డిసెంబర్ 29 అర్ధరాత్రి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ మొదలుపెడుతున్నట్టు కాంగ్రెస్ ప్రకటించింది. దాంతో కేసీఆర్ దీక్ష విరమించారు. కానీ వంచనకు బ్రాండ్ అంబాసిడర్ అయిన కాంగ్రెస్ వెనక్కి తగ్గడంతో మరోసారి తెలంగాణ యుద్ధ భూమిగా మారింది. అన్ని రాజకీయ పార్టీలు ఒక్కటి కావాలని జేఏసీని స్థాపించిన కేసీఆర్ ఐక్య ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు. సకలజనుల సమ్మె, సాగరహారం, సంసద్ యాత్ర వంటి కార్యక్రమాలు, కేసీఆర్ చేసిన రాజకీయ పోరాటం ఫలించి తెలంగాణ స్వప్నం సాకారమైంది. నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ అన్నట్టు.. తెలంగాణ ఉద్యమాన్ని చేపట్టి, తన జీవిత కాలంలో అనుకున్న లక్ష్యాన్ని అందుకున్న అద్భుతమైన నాయకుడు కేసీఆర్. తెలంగాణ ఏర్పడ్డాక టీఆర్ఎస్ పార్టీని గెలిపించి, పదేండ్లపాటు ఉద్యమ సారథికే పాలనా పగ్గాలు అప్పగించడం మరో చరిత్ర. పద్నాలుగేండ్ల ఉద్యమ ప్రస్థానానికి లభించిన గొప్ప అవకాశం. ఇప్పుడు మరోసారి ఏప్రిల్ 27 వస్తున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజలందరూ జబ్బకు సంచి చేతిలో జెండా పట్టుకొని 'జాతర పోదమా.. తెలంగాణ జాతర పోదమా..' అన్నట్టు బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిపోవాలి.




## ముస్లింలపై ఎందుకీ వివక్ష?



పంక్చర్-వాలాస్ అనేది అసహ్యకరమైన పదం. పంక్చర్ అయిన టైర్లను రిపేర్ చేయడం ముఖ్యమైన సేవ, శ్రమించి చేసే పని. అందరు ముస్లింలు టైర్లను రిపేర్ చేయడం లేదు. చాలా మంది కష్టపడి ఈ రోజు వైద్యులు, విద్యావేత్తలు, పారిశ్రామిక వేత్తలు అయ్యారు. ప్రధాని మోదీ అనేక స్థాయిల్లో తప్పు చేస్తున్నారు. వివక్ష చూపిస్తున్నారు. దీన్ని ఆయన మానేయాలి.

**- సాగరిక ఘోష్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ**

**నీ ముక్కు ఎక్కడుందంటే.. సూటిగా చూపించకుండా తల చుట్టూ తిప్పి చూపించాడట వెనుకటికొకడు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు తీరు కూడా అచ్చం అలాగే ఉన్నది. కొద్ది రోజుల కిందట హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో తీవ్ర తాగునీటి సమస్య ఏర్పడింది. స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిష్కరించాల్సిన ఆ సమస్య కేపీహెచ్‌బీ కాలనీ నుంచి వనపర్తి మీదుగా సీఎం రేవంత్ రెడ్డికి చేరి, అక్కడి నుంచి యూ టర్న్ తీసుకొని వినతి పత్రంగా మారి ప్రజాభవన్‌కు వచ్చి వాలింది. ఇదీ.. సీఎం రేవంత్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను హ్యాండిల్ చేస్తున్న తీరు.**

# ముళ్ల కంచెల ప్రజాపాలన

2023 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయకముందే రేవంత్‌రెడ్డి చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సమైక్య పాలకులు సీఎం క్యాంప్ ఆఫీస్ చుట్టూ ఏర్పాటుచేసిన కంచెను తొలగించి ప్రజా పాలన అంటూ గప్పాలు కొట్టారు. ప్రగతిభవన్ పేరును మార్చి రాష్ట్ర ప్రగతికి అడ్డుకట్ట వేశారు. ప్రజాభవన్‌గా నామకరణం చేసి ప్రజా సమస్యలను గాలికి వదిలేశారు. ప్రజావాణి, ప్రజాదర్బార్ అంటూ ప్రజా సమస్యలను చిటికెలో తీరుస్తానని, ఎక్కడికక్కడ సమస్యలకు పరిష్కారం చూపుతానని పెదరాయుడు లెవల్లో పోజులు కొట్టారు. హంగూ ఆర్భాటంతో ఒకటి రెండు రోజులు హడావుడి చేశారు. ప్రజాపాలనలో ప్రజా సమస్యలన్నీ మంత్రం వేసినట్టు మాయం చేస్తారేమోనని రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది ప్రజలు ప్రజాభవన్‌కు తరలివెళ్లారు. తాను లేకపోయినా మంత్రులు వస్తారని, అధికారులు నిత్యం ఉంటారని సమస్యలు పరిష్కరిస్తారని ప్రగల్భాలు పలికారు. కానీ, ఇప్పుడు అక్కడ ముఖ్యమంత్రి, మంత్రులు కాదు కదా కనీసం అధికారులు కూడా కనిపించడం లేదు. సమస్యలు చెప్పుకునేందుకు 24 గంటలు గేట్లు తెరిచి ఉంటాయని ముఖ్యమంత్రి చెప్పినట్టే గేట్లయితే తెరిచే ఉంటున్నాయి, కానీ మంత్రులు, అధికారులు సమస్యల నుంచి తప్పించుకొని తలుపులు మూసుకున్నారు. ఇప్పుడు ప్రజాభవన్‌లో సమస్యలు, వాటిని చెప్పుకునేందుకు వచ్చిన వారి వెతలు తప్ప ఇంకేమీ కనిపించడం లేదు.



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి లక్షల మంది తమ సమస్యలను చెప్పుకొనేందుకు ప్రజాభవన్‌కు బారులు తీరుతున్నారు. లక్షల సంఖ్యలో వినతి పత్రాలు సమర్పిస్తున్నారు. కానీ, వాటిలో ఏ ఒక్కటీ పరిష్కారమైన దాఖలాలు కనిపించడం లేదు. ఇప్పటి వరకు చేసిన ఫిర్యాదులు, ఇచ్చిన వినతిపత్రాలు ఏమయ్యాయో తెలియదు. వాటి పరిష్కారం ఎంతవరకు వచ్చిందనే విషయం చెప్పే నాథుడే లేడు. వాస్తవానికి ప్రజా సమస్యలు ఎక్కడికక్కడ పరిష్కారం అవ్వాలి. ఎక్కడో మారుమూల ప్రాంతంలో నెలకొన్న సమస్య గురించి రాజధాని హైదరాబాద్‌కు వచ్చి చెప్పుకోవాల్సి రావడం దురదృష్టకరం. ఉమ్మడి ఏపీలో తెలంగాణ ప్రజలు పడ్డ వెతలను కండ్లారా చూసిన కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కొత్త జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీలను ఏర్పాటుచేసి పాలనను వికేంద్రీకరణ చేశారు. తద్వారా ప్రజల వద్దకే పాలనకు శ్రీకారం చుట్టారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎక్కడి సమస్యను అక్కడే పరిష్కరించేలా చూశారు. కానీ, రేవంత్‌రెడ్డి సర్కార్ వచ్చాక మళ్లీ మొదటికి వచ్చింది.

> సాధారణంగా కేపీహెచ్‌బీ కాలనీలో తాగునీటి సమస్య అక్కడే పరిష్కారం అవ్వాలి. దానికోసం వనపర్తికి వెళ్లి మరీ ముఖ్యమంత్రికి విన్నవించాల్సి రావడం దురదృష్టకరం. సీఎం ఒక్క ఫోన్ కాల్ చేస్తే పరిష్కారం అవ్వాల్సిన సమస్యను మళ్లీ ప్రజావాణికి వెళ్లి విన్నవించుకోవాల్సి రావడం రేవంత్ పాలన వైఫల్యానికి నిదర్శనం. సమస్యలను, వాటి పరిష్కారాన్ని కేంద్రీకృతం చేసిన రేవంత్‌రెడ్డి ప్రజలను సమస్యల వలయంలో చిక్కుకునేలా చేశారు.

జూబ్లీహిల్స్ ప్యాలెస్ చుట్టూ మొలిచిన ముళ్ల కంచెలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. ప్రజాపాలన పేరు చెప్పి ప్రజల సీఎం అయిన రేవంత్ ఇప్పుడు కనీసం ప్రజలను కలిసే పరిస్థితి లేదు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్యకే సీఎం అపాయింట్మెంట్ దొరకలేదు. ఆ విషయంపై సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున దుమారం చెలరేగ డంతో అపాయింట్మెంట్ దొరికింది. ఇక సామాన్యుల పరిస్థితిని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు అనుకుంటా.



**గంగుల కమలాకర్**

**(వ్యాసకర్త: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మాజీ మంత్రి)**